# ఇలాంటి వారు ఉంటారు!

"కుర్రాడు బి.ఎస్.సి. పాసయ్యాడు. ఉన్న ఊరిలోనే టీచర్‌గా పనిచేస్తున్నాడు. వాళ్ళకి ఇల్లూ, వాకిలీ, పొలాలూ ఉన్నాయట. మీరొకమారు వెళ్ళి మాట్లాడి రారాదూ" అంది శ్రీమతి.

మా అమ్మాయి సుజాత రెండేళ్ళ క్రితం ఇంటర్ పాసైంది. అప్పటినుంచి పెళ్ళికొడుకుల వేటలో ఉన్నాను. కాలిచెప్పులు అరిగిపోతున్నాయి. కాని ఇంతవరకూ ఏ సంబంధం కలసిరాలేదు. దేశంలో పెళ్ళి కొడుకులకు కొదువలేదు. అయితే వాళ్ళ తల్లిదండ్రులు కొండెక్కి కూర్చుంటున్నారు. వాళ్లు అడిగే కట్నాలు ఇచ్చుకునే స్థితిలో మేం లేం.

"ఏ ఊరన్నావు?" ఆ సంబంధం కుదిరినా కుదరకపోయినా ప్రయత్నం చేయాలిగా! నా భార్య పెద్దగా ఆశపెట్టుకోవడం నాకు నచ్చలేదు. సంపన్నుల అబ్బాయి, చదువుంది, ఉద్యోగం ఉంది. మనవరకు వస్తుందన్న ఆశలేదు. వీళ్ళు మాత్రం ఎక్కువ కట్నం అడగకుండా ఉంటారా?

నా మనసులోని మాట శ్రీమతితో అంటే అపశకునపు మాటలు అంటూ నా మీద విరుచుకుపడుతుంది.

"ఎంతో దూరంలేదు. భీమునిపట్నం" అంది.

పార్వతీపురంలో వుంటున్నాం. విజయనగరం వెళ్ళి అక్కడి నుంచి భీమునిపట్నం బస్సులో వెళ్ళాలి.

"సరళా! అంతా బాగానే వుంది. ఒక్కడినే వెళ్ళాలంటే నాకు భయంగా ఉంది. సరిగ్గా మాట్లాడగలనో, లేనో, ఎవరైనా తోడుంటే బాగుంటుంది. వాళ్ళెవరో నాకు తెలియదు. ఆ ఊరూ కొత్త" అన్నాను.

"మీరు ప్రయాణం అనే సరికి తప్పించుకోవడానికి లక్షసాకులు చెప్తారు. మరో మనిషి ఎవరొస్తారు? అయినా డబ్బు దండగ" అంది.

ఈ ప్రయాణం తప్పేట్లు లేదు, కొత్తచోట ఎక్కడ వుంటాం? ఎక్కడ భోజనంచేస్తాం?

"మీరేం భయపడకండి. ఆ ఊరిలో సీతారామమూర్తిగారున్నారు. వారిని కలవండి" అంది.

ఏ సీతారామమూర్తో? సరళకు చుట్టాలా? ఎప్పుడూ భీమునిపట్నంలో తనకు కావలసిన వారు ఉన్నట్లు సరళ చెప్పలేదే?

"చాలా బాగుంది. ఈ పెళ్లికొడుకు తల్లిదండ్రులే నాకు తెలియదు. మరొక అపరిచిత వ్యక్తి పేరు చెప్పి అతడ్ని కలవమన్నావు" అన్నాను.

"మీరలా అంటారని నాకు తెలుసు. సీతారామమూర్తిగారితో మనకు పరిచయంలేని మాట వాస్తవమే. అతను రంగనాథానికి బాగా కావలసినవాడు. కనుక రంగనాథం సీతారామమూర్తిగారికి ఉత్తరం రాశాడు. మీరే పనిమీద వస్తున్నారో వివరంగా రాసి మీకు సహాయం చేయమన్నాడు. రంగనాథంగారు కూడా మీతోపాటే వచ్చేవారే, కాని వారి కోడలికి పురిటిరోజులు" సరళ ఒక ఉత్తరాన్ని నా చేతిలో పెట్టింది.

"రేపు బుధవారం దశమి" అంది.

◆ ◆ ◆

విజయనగరంలో బస్సు దిగి. భీమునిపట్నం వెళ్ళే బస్సుకోసం చూశాను. నా అదృష్టం బాగుంది ఆ బస్సు రెడీగా ఉంది. ఆ బస్సు భీమునిపట్నం వెళ్తుందని నిర్ధారించుకుని ఎక్కాను. అప్పటికి బస్సు ఖాళీగా ఉంది. టూ సీటర్‌లో కిటికీవైపు సీటులో కూర్చున్నాను. నేను పార్వతీపురంలో ఎక్కిన బస్సు చాలా రద్దీగా ఉంది. కూర్చోవడానికి సీటు దొరకలేదు. రామభద్రపురంవరకు నిలబడే ప్రయాణం చేశాను. ఒళ్లు హూనమైంది.

నాకు ఈ బస్సులో సదుపాయమైన సీటు దొరికినందుకు సంతోషంగా ఉంది. మరో ఐదారు నిముషాల్లో బస్సు రమారమి నిండిపోయింది. నా పక్కన మరో మనిషి కూర్చోవడానికి సీటుంది. బహుశా నా స్థూలకాయాన్ని చూసో ఏమో ఎవరూ నా పక్క చేరలేదు. అదీ మంచిదే అనుకున్నాను. ఒకరిద్దరు నిలబడే ఉన్నారు. కండక్టర్ 'రైట్' చెప్పాడు. బండి కొంతమేరకు రివర్సులో వెళ్ళి ముందుకు కదిలింది.

నా సంతోషం చిటికెలో విషాదంలోనికి మారింది. నడుస్తున్న బస్సులో ఒకతను ఎక్కి నా పక్కన ఖాళీగా ఉండడం గమనించి అక్కడ కూర్చున్నాడు. నేనే స్థూలకాయుడ్ని. అతడూ నన్ను తీసిపోడు.

మా ఇద్దరి మధ్య కళ్ళతోనే చిన్నయుద్ధం జరిగింది. జాగా చాలక నన్ను అటు సర్దుకోమంటాడు. అటు జరగడానికి నాకు జాగా లేదు. చాలీచాలని జాగాలో ఇమడలేక అతడు తన తుంటితో నెట్టాడు. నేనూ అదే పనిచేశాను. నిజం చెప్పాలంటే ఇద్దరం ఒకరినొకరు నెట్టుకుంటూనే వస్తున్నాం. ఒకమారు బలమంతా ఉపయోగించి అతడ్ని నెట్టాను. అప్రమత్తంగా ఉన్న అతను అటు పక్కకు వాలి ఆ పక్క వరుస సీటులోని ఒక ఆడమనిషి మీద పడ్డాడు. అతడు పల్లెత్తి మాట్లాడలేదు. కాని కోపంగా నా వంక చూశాడు. నేను సారీ కూడా చెప్పలేదు. మంచి శాస్తి జరిగిందని మనసులో సంబరపడ్డాను. ఆ ఆడమనిషి ఇతనిమీద కయ్యానికి లేచింది. ఆ ప్రయాణంలో మేం బద్ధశత్రువుల్లా ప్రవర్తించాం.

ఇంతకుముందే వేరే బస్సులో పార్వతీపురంనుంచి రామభద్రపురంవరకు నిలబడిచేసిన ప్రయాణమే మెరుగనిపించింది. ఎందుకొచ్చిన బాధ, లేచి నిలబడాలన్న తలంపు వచ్చినా అది నా ఓటమిని అంగీకరించడమే అని అలాగే బాధపడుతూ కూర్చున్నాను.

బస్సు భీమునిపట్నం దరిదాపుల్లో చేరింది. ఆ ఊరి ముందు స్టాప్‌లో అతడు నన్ను కోపంగా చూస్తూ దిగిపోయాడు. పీడ విరగడైంది అనుకున్నాను. అతను దిగిన మరో ఐదునిముషాలకు బస్సుస్టాండులో ఆగింది.

సీతారామమూర్తిగారి ఇల్లెక్కడో తెలియదు. అక్కడే ఒక టీ స్టాల్‌లో టీ తీసుకుని ఇతని అడ్రస్‌చెప్పి దారి ఎలాగో చెప్పమని ఆ స్టాల్ వాడిని అడిగాను.

"మీరు రిక్షాలో వెళ్ళండి. ఆ వీధిలోనికి వెళ్తే ఎవరైనా అతని ఇల్లు చూపిస్తారు. నడిచి వెళ్తే దారి కనుక్కోలేరు" అన్నాడు.

"మీరు ముందు స్టేజీలో దిగి వుంటే మీకు శ్రమ ఉండేది కాదు. నడుచుకుంటూ సునాయాసంగా వెళ్ళగలిగేవారు. అయినా మీరు ఊరికి కొత్తలాగున్నారు. రిక్షావాడు నాలుగు రూపాయలు తీసుకుంటాడు" అని కూడా చెప్పాడు.

రిక్షావాడితో మాట్లాడాను. వాడు నన్నుచూసి ఎనిమిది రూపాయలు అడిగాడు. పదిగంటలు దాటిందేమో ఎండ చుర్రుమంటోంది. చివరకు వాడు ఆరు రూపాయలు తీసుకోవడానికి ఒప్పుకున్నాడు. వాడికి వారిల్లు తెలుసులా వుంది. తిన్నగా వారి గుమ్మం దగ్గర రిక్షా ఆపి ఇదే వారిల్లు అన్నాడు.

నా ప్రయాణంలో ఒక మజిలీ పూర్తయింది. ఆ ఇంటిని చూశాను. అదొక పాత పెంకుటిల్లు. ఇల్లు చాలా లోపలికి వుంది. బయట ప్రహరీ గోడ, చిన్న ఇనుప గేటు. ఇంటికీ, గేటుకీ మధ్య విశాలమైన ఖాళీస్థలం.

గేటుమీద శబ్దం చేస్తూ సీతారామమూర్తిగారూ! అంటూ రెండుసార్లు గట్టిగా పిలిచాను.

రెండు నిముషాల పాటు అలా నిల్చున్నాను.

ఇంతలో అప్పుడే స్నానంచేసి లుంగీ చుట్టుకుని తువ్వాలుతో తల తుడుచుకుంటూ ఒకతను వస్తూ 'ఎవరూ' అంటూ అడిగాడు.

నా గుండెల్లో గతుక్కుమంది.

నాతోపాటు ప్రయాణంచేసిన శాల్తీ. పులినోట్లో పడడానికి వచ్చానా? ఇప్పుడేం దారి?

అతనితో ఆకారణంగా వైరం తెచ్చుకున్నాను. ఇప్పుడేముఖం పెట్టుకుని పలకరించి నేనొచ్చిన పని చెప్పను? అతను నన్ను చూసి పోల్చకుండానే వెళ్ళిపోవడం ఉత్తమ మనిపించింది. వెనుతిరిగాను.

ఆ మాట్లాడేదేదో ఆ పెళ్ళివారితోనే మాట్లాడవచ్చు. ఎలాగూ ఆ సంబంధం అవుతుందన్న నమ్మకం లేదు.

"మాస్టారూ! వెళ్ళిపోతున్నారేం? రండి లోపలకు" అతను గేటు తీస్తూ అన్నాడు. నేనెవరినో అతనికి అర్థమయ్యే వుంటుంది.

అతడికి నామీద చాలా కసిగా ఉంటుంది. ఇంటిలోనికి పిలిచి నాకు దేహశుద్ధి చేస్తాడా? అతనికి స్థానబలిమి ఉంది.

ఏమైతే అదే జరుగుతుందని అతడ్ని అనుసరించాను. నేననుకున్నదేది జరగలేదు. చాలా సౌమ్యంగా మాట్లాడాడు. "నా దగ్గరకే వస్తున్నారని బస్సులో నాకు తెలియనే తెలియదు" అన్నాడు.

నాకు మాత్రం తెలుసా? తెలిస్తే అంత మోటుగా ప్రవర్తించేవాడినా? నేను నిలుచుండి అతనికా సీటు ఇచ్చేవాడిని.

నా గురించి చెప్పి రంగనాథం రాసిన ఉత్తరంతీసి అతని చేతికిచ్చాను. ఉత్తరాన్ని చదివి "వాళ్ళంతా బాగున్నారా? వాళ్ళ కోడలికి పురుడొచ్చిందా?" అంటూ అడిగాడు.

నేను జవాబు చెప్పాను.

"మీరు అదృష్టవంతులు. సమయానికి నేను ఉన్నాను. పనిమీద ఈ ఉదయమే విజయనగరం వెళ్ళాను. నా పని తొందరగా అయిపోయింది. అందుకే వెంటనే తిరిగొచ్చాను. నిజం చెప్పాలంటే నిన్ననో మొన్ననో మీరొచ్చి ఉంటే మీ ప్రయాణం దండగయ్యేది. మీరు ఎవరింటికి వెళ్ళాలని వచ్చారో వాళ్ళు ఈ మధ్యనే తిరుపతి వెళ్ళి నిన్న రాత్రే తిరిగి వచ్చారు" అన్నాడు.

ఒక విధంగా అది అదృష్టమే. వాళ్ళే కనుక లేకుంటే మళ్ళీ రావలసి వుండేది. వాళ్ళు పెళ్ళిచూపులకు వస్తామంటే అదీ అదృష్టం అనుకున్నాను.

అతను నా భోజనానికి ఏర్పాటు చేశాడు. అతని ఆతిథ్యానికి నాకు సంతోషం వేసింది.

"కొంతసేపు మీరు విశ్రమించండి. రెండు గంటలకు వాళ్ళ ఇంటికి వెళ్దాం. అప్పటికి వారిఅబ్బాయి కూడా వస్తాడు" అన్నారు. నా కోసం మడతమంచం వేసి దుప్పటి పరిచి తలగడా ఇచ్చారు.

గతంలో కొన్ని సంబంధాలకోసం వెళ్ళినప్పుడు నేను అనుభవించిన కష్టాలు గుర్తుకొచ్చాయి. కృతజ్ఞతలు ఇతనికి చెప్పాలా నన్ను పంపిన రంగనాథానికా?

నాకు కునుకు పట్టింది.

నాకు తెలివి వచ్చేసరికి అతను ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నాడు. అతను మాట్లాడుతున్నది. నా విషయమే అని అర్థయ్యింది.

"లేచారా? ముఖం కడుక్కోండి. బయలుదేరుదాం" అన్నాడు. అప్పటికతను తయారైఉన్నాడు.

సీతారామమూర్తి గారు అది తన స్వంత విషయం అన్నట్లు ప్రవర్తించారు. వారి మీద గల గౌరవంతో పెళ్ళిపెద్ద చూపులకు రావడానికి అంగీకరించారు.

"పిల్ల ఫోటోలను చూశాం. మీ గురించి రాముడు చెప్పాడు. పెళ్ళిచూపులు ఒక ఫార్మాలిటీయే" అన్నారు పెళ్ళిపెద్ద.

నా సాధకబాధకాలు చెప్పి పెద్దగా కట్నం ఇచ్చుకోలేం అని ముందే చెప్పాను. పిల్ల నచ్చినా చాలా సంబంధాలు అక్కడే పుటుక్కుమంటున్నాయి.

"విశ్వనాథంగారూ! మీరేం దిగులు పెట్టుకోకండి. కట్నం మీరెంత ఇవ్వగలిగితే అంతే ఇవ్వండి. పెళ్ళిచూపులకు వారితోపాటు నేనూ వస్తాను. రంగనాథాన్ని కూడా చూడ్డం అవుతుంది. వారి కోడలు ఎవరో కాదు, నా మరదలు కూతురే' అన్నారు.

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో నన్ను బస్సు ఎక్కించడానికి వచ్చారు. సుజాత అదృష్టవంతురాలని నాకనిపించింది.

బస్సులో జరిగినదానికి క్షమాపణ చెప్పాలని ఎన్నోమార్లు అనుకున్నాను. కాని నా నోరు పెగలలేదు. అతను ఆ అవకాశమూ ఇవ్వలేదు.

అతని జాగాలో నేనుండి, నా సహాయం కోసం అతను నాయింటికి వచ్చి వుంటే బస్సులో నన్ను పెట్టిన ఇబ్బంది చాలు అని ముఖంమీద అనివుండేవాడినేమో!?

కాని ఇలాంటి ఉత్తములూ కొందరుంటారని నాకప్పుడే తెలిసింది.

ప్రియదత్త సకుటుంబ సచిత్రవారపత్రిక **19.02.03**